సాక్షి సిద్దిపేట

ఆదివారం । 26 । జనవరి । 2025

సండే స్పెషల్



## దేశభక్తి.. చరిత్రకు స్ఫూర్తి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణతంత్ర వేడుకలకు సిద్ధమయ్యారు. గ్రామాల్లోని చారిత్రాత్మకమైన నేపథ్యం ఉన్న బురుజులపై జెండా రెపరెపలాడనుంది. వివరాలు 8లో ▸



## చదువుల్లో మేటి.. చలో ఢిల్లీ

ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలను నేరుగా తిలకించే అవకాశం వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల విద్యార్థినికి దక్కింది. వివరాలు 8లో ▸



## సత్ప్రవర్తనతో ఉండాలి

ఖైదీలు జైలులో సత్ప్రవర్తనతో ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. వివరాలు 9లో ▸

## న్యూస్‌రీల్

### నేడు మల్లన్న లష్కర్ వారం

- భారీగా తరలిరానున్న భక్తులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



స్వామివారి మూలవిరాట్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మల్లన్న క్షేత్రానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రెండవ ఆదివారానికి (లష్కర్) సికింద్రాబాద్ భక్తులతో పాటు ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్ జిల్లాలకు చెందిన వేలాదిమంది భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోనున్నారు. సికింద్రాబాద్‌కు చెందిన భక్తులుభక్తులు తరలివచ్చి మల్లన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనుండటంతో రెండవ ఆదివారాన్ని లష్కర్ వారంగా పిలుస్తారు. శనివారం సాయంత్రానికి మల్లన్న క్షేత్రానికి చేరుకుని మల్లన్న దూళీ దర్శనం చేసుకున్నారు. లష్కర్ వారం సందర్భంగా భక్తులు మల్లన్నకు పట్నం వేసి బోనం సమర్పించడంతో పాటు అమ్మవార్లకు ఒడిబియ్యం, కొబ్బరికాయలు కొట్టిమొక్కులు తీర్చుకోనున్నట్లు చెప్పారు. లష్కర్ వారానికి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

### ఓటు హక్కు చాలా కీలకమైనది

ఆర్డీఓ రామ్మూర్తి



హుస్నాబాద్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

హుస్నాబాద్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అనేది చాలా కీలకమైనదని ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు హక్కును వినియోగించుకుంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకున్నట్లేనని అన్నారు. ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. పౌరులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎస్‌ఐ మహేశ్, ఎంఈఓ బండారి మనీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మారథాన్‌లో సత్తాచాటిన ఉపాధ్యాయుడు

42 కిలోమీటర్ల మారథాన్ పోటీలో శ్రీనివాస్ ప్రతిభ



ఉపాధ్యాయుడు బోడ శ్రీనివాస్

దుబ్బాక: మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బోడ శ్రీనివాస్ ముంబైలో జరిగిన ఆసియా ఖండంలోని అతిపెద్ద మారథాన్ 42.195 కిలోమీటర్లను పూర్తి చేశారు. సిద్దిపేట జిల్లా చండ్లాపూర్‌కు చెందిన శ్రీనివాస్ ధర్మాజీపేట పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఇటీవల ముంబైలో జరిగిన అతిపెద్ద మారథాన్‌లో దేశంలోని 64,998 మంది రన్నర్స్ పాల్గొన్నారు. ఆగస్టులో భారతదేశంలో అతి క్లిష్టమైన ఎస్ఎండీసీ మారథాన్‌కు కూడా పూర్తి చేశాడు. సిద్దిపేట, హుస్నాబాద్, కరీంనగర్, హైదరాబాద్‌ల్లో కూడా 10 హాఫ్ మారథాన్‌లు కూడా పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించడం పట్ల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను శనివారం ఎంఈఓ ప్రభుదాసు, హైస్కూల్ హెచ్‌ఎం సాదత్‌అలీ, సన్మానించారు.

## మానవ హారం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నంగునూరులో మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఎంపీడీఓ లక్ష్మణప్ప, ఎంఈఓ దేశిరెడ్డి, ఎస్‌ఐ అసిఫ్, ఆర్‌ఐ లింగం తదితరులు పాల్గొన్నారు.

– నంగునూరు(సిద్దిపేట):



# వర్గీకరణకు సమయం ఆసన్నం

- ఇప్పుడు కాకుంటే... మరెప్పుడూ కాదు
- 7న 'లక్ష డప్పుళ్లు.. వెయ్యి గొంతులు'కు తరలిరండి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ పిలుపు
- సిద్దిపేటలో భారీ ర్యాలీ





సిద్దిపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం డప్పు కొడుతున్న మందకృష్ణ మాదిగ, పట్టణంలో భారీ ర్యాలీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో ఇప్పుడు ఎస్సీ వర్గీకరణ అమలు కాకుంటే మరెప్పుడూ జరగదని, దేశంలో వివిధ రాష్ట్రాలలో ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ కమిషన్‌లు అన్ని ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ''లక్ష డప్పుళ్లు... వెయ్యి గొంతులు''సన్నాహక సమావేశంలో భాగంగా శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రపంచం వినేలా లక్ష డప్పుల ద్వారా మహత్తరమైన సాంస్కృతిక మహా ప్రదర్శన చేస్తున్నామన్నారు. వర్గీకరణ తక్షణ అమలు కోసం ప్రతిఒక్కరూ డప్పు తీసుకుని హైదరాబాద్‌కు రావాలన్నారు. వంద డప్పుల శబ్దానికి సిద్దిపేట దద్దరిల్లిందని, లక్షల డప్పుల మోతతో ప్రపంచమే మన వైపు చూడనుందన్నారు. వర్గీకరణ అమలు అయితే వంద తరాలకు ఉపయోగపడుతుందన్నారు. ఈవిషయమై అన్ని పార్టీలకు మద్దతు తెలిపామన్నారు. ఈ పోరాటంలో ఎక్కడ ఆత్మస్థైర్యం కోల్పోకుండా, శాంతియుతంగానే పోరాటం చేస్తున్నామన్నారు. 7న లక్ష డప్పులు.. వెయ్యి గొంతుల కార్యక్రమం భారీ సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఉద్యమం, తెలంగాణ ఉద్యమాలు రెండు న్యాయమైన పోరాటాలన్నారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అనంతరం బీజేఆర్ చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా అంబేడ్కర్ చౌరస్తాలో గుర్రం జట్కాపై ఎక్కి డప్పును మోగించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, పెర్క పర్శరాములు, ముంద్రాతి కృష్ణ, మల్లిగారి యాదగిరి, కొలిమి మల్లేశం, జువన్న కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## 4 కొత్త పథకాలకు నేడు శ్రీకారం

సాక్షి, సిద్దిపేట: ప్రజాపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న నాలుగు సంక్షేమ పథకాలకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం ప్రారంభించనున్నారు. మండలానికి ఒక గ్రామంలో ఈ నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను 26 గ్రామాల్లో ప్రారంభించనున్నారు.

**26 గ్రామాల్లో ప్రారంభం**

ఎల్లుపల్లి(సిద్దిపేట అర్బన్), వెంకటాపూర్(సిద్దిపేట రూరల్), మాటిండ్ల (నారగణరావుపేట), మెట్టుపల్లి(చిన్న కోడూరు), నాగరాజుపల్లి(నంగనూరు), బల్వంతాపూర్(దుబ్బాక), కొనాయపల్లి(దౌల్తాపూర్), లక్ష్మీనగర్(మిరుదొడ్డి), తుక్కాపూర్(తొగుట), పోసాన్‌పల్లి (కొముర‌వెల్లి), రాంపూర్(చేర్యాల), రామేశ్వరంపల్లి(అక్బర్‌పేట-భూంపల్లి), గిరిపల్లి(గజ్వేల్), మేదినిపూర్(కుకునూరుపల్లి), అంబర్‌పేట్(వర్గల్), లక్ష్మక్కపల్లి(ములుగు), లింగారెడ్డిపల్లి(జగదేవ్‌పూర్), భవనంతాపూర్(మర్కూక్), దమ్మక్కపల్లి(కొండపాక), రామారం(రాయపోలు), తోటపల్లి(హుస్నాబాద్), ధర్మారం(మద్దూరు), కూటిగల్(దూల్మిట్ట), కుందనవానిపల్లి(అక్కన్నపేట), పొరెడ్డిపల్లి(కోహెడ), వీరాపూర్(బెజ్జంకి)లలో ప్రారంభం చేయనున్నారు.

### ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు నీరు

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు నుంచి ఘనపూర్ ఆయకట్టుకు శనివారం సాగునీటిని వదిలారు.0.35 టీఎంసీల నీటిని జలవిద్యుత్ కేంద్రం ద్వారా వదలడంతో రెండు టర్బయిన్‌లను రన్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఏటా ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు నుంచి విడతల వారీగా సాగునీటిని వదులుతారు. ఈ సాగునీరు మంజీరా గుండా ఘనపూర్ ఆయకట్టుకు చేరుకుంటుంది.

# అర్హులు ఎక్కువ..మంజూరు తక్కువ

- తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- సొంత ఇంటి స్థలం ఉన్నవారు 55వేల మంది
- అధికారులకు తలనొప్పిగా మారిన లబ్ధిదారుల ఎంపిక





సాక్షి, సిద్దిపేట: మంది ఎక్కువ.. మజ్జిగ తక్కువ అన్నట్లుంది ఇందిరమ్మ ఇళ్ల వ్యవహారం. ఇళ్ల కోసం అర్హులు ఎక్కువ మంది ఉంటే.. తక్కువ మందికే మంజూరు కానున్నాయి. దీంతో ఏం చేయాలో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సొంతింటి కల సాకారం కోసం ఏళ్లగా నిరుపేద ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3.500 ఇళ్ల చొప్పున మంజూరు కానున్నాయి.

**అర్హులు 55 వేల మంది**

ప్రజాపాలనలో భాగంగా 2023 డిసెంబరు 28 నుంచి 2024 జనవరి 6 వరకు ఆరు గ్యారెంటీల అమలు కోసం ఒకే దరఖాస్తు ఫామ్‌లో అన్ని పథకాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. 514 గ్రామ పంచాయతీలు, 115 మున్సిపల్ వార్డుల నుంచి ఇందిరమ్మ ఇళ్ల కోసం 2,36,014 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఇందిరమ్మ ఇళ్లకు అర్హులను అధికారులు గుర్తించారు. ముసాయిదా జాబితాను గ్రామసభల్లో చదివి వినిపించారు. వీటిలో 55,025 మందికి ఇంటి స్థలాలు ఉండగా.. ఇళ్లు లేదని నిర్ధారించారు. 79,526 మందికి ఇంటి స్థలాలు లేవని తేలింది. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన గ్రామ సభలలో మరో 28,113 మంది దరఖాస్తు చేసుకున్నారు.

**స్థలం ఉన్న వారికి..**

సొంత ఇంటి స్థలం ఉన్న వారిని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ 5లక్షల ఆర్థిక సాయాన్ని ఐదు విడతల్లో అందించనుంది. ఇంటి స్థలం లేని వారి గురించి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆదివారం నుంచి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేయనున్నారు.

**పైరవీలు ప్రారంభం**

ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం 55వేల మంది అర్హులని తేలింది. కానీ జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో సుమారుగా 13వేల ఇళ్లు మాత్రమే ప్రభుత్వం మంజూరు చేసే అవకాశం ఉంది. తమకు ఇళ్లు లేదని కిరాయి ఇళ్లలో ఉంటున్నామని, పూరి గుడిసెలో నివాసం ఉంటున్నామని మొదటి జాబితాలోనే మంజూరయ్యే విధంగా చూడాలని కాంగ్రెస్ నాయకులు, అధికారుల చుట్టూ దరఖాస్తుదారులు తిరుగుతున్నారు. కాంగ్రెస్ నాయకులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తమ వారికి మొదటి విడతలో మంజూరు చేయాలని అధికారుల వద్ద పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఎవరికి మంజూరు చేయాలని అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. ఒకరికి మంజూరు చేస్తే మరొకరు తమకు ఎందుకు మంజూరు చేయలేదని గొడవకు దిగుతారని పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## సుపరిపాలనకు ఓటు వజ్రాయుధం



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి, ఇతర అధికారులు

- కలెక్టర్ మనుచౌదరి
- పట్టణంలో అవగాహన ర్యాలీ

సిద్దిపేటజోన్: సుపరిపాలనకు ఓటు వజ్రాయుధం .. సమాజ మార్పునకు ఆక్సిజన్ లాంటిదని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నేటి తరం యువతకు ఓటు విలువ, ఎన్నికల ప్రక్రియ గురించి పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. సీనియర్ ఓటర్లను యువత రోల్ మోడల్‌గా తీసుకోవాలన్నారు. ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీత, సిద్దిపేట ఆర్డీఓ సదానందం మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి ఓటు ఒక పెద్ద పునాది లాంటిదన్నారు. ప్రజలను మరింత చైతన్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకుముందు పట్టణంలో విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, ఆర్డీఓ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందు ఓటు ప్రాముఖ్యత, ఓటరు నమోదు.. తదితర అంశాలపై కలెక్టర్ యువతకు అవగాహన కల్పించారు. పలు ప్రశ్నలను అడిగి వారి నుంచి జవాబులు రాబట్టారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ సలీం మియా, రూరల్ తహసీల్దార్ వెంకటేష్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు 29 మంది విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

నంగునూరు(సిద్దిపేట): గజ్వేల్‌లో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడోత్సవాల్లో రాజగోపాల్‌పేట విద్యార్థులు సత్తా చాటారు. కళాశాల నుంచి వివిధ అంశాల్లో 66 మంది విద్యార్థులు పాల్గొనగా రాష్ట్రస్థాయి పోటీలకు 29 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. బాలికల విభాగంలో ఖోఖో, టేబుల్ టెన్నిస్, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్ రిలే పోటీల్లో మొదటి స్థానం, పలు అంశాల్లో ద్వితీయ, తృతీయ బహుమతులు పొందడంతో ఓవరాల్‌గా వ్యక్తిగత చాంపియన్‌గా అక్షిత నిలిచిందని చెప్పారు. పురుషుల విభాగంలో కబడ్డీ, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో, షాట్‌పుట్, లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు. దీంతో ఫిబ్రవరిలో హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు 16 మంది బాలురు, 13 మంది బాలికలు ఎంపికయ్యారన్నారు. శిక్షణ ఇచ్చిన ఇన్‌చార్జీ వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్‌లను అధ్యాపకులు అభినవ్, రాజు, షెహబాజ్ అభినందించారు.

## దరఖాస్తుల ఆహ్వానం



సిద్దిపేటరూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియెట్, ఉన్నత చదువులు చదువుతున్న వికలాంగ విద్యార్థిని విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికి గాను పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

## అదృష్టంగా భావించి.. అభివృద్ధి చేశా

మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి



చేర్యాల(సిద్దిపేట): నూతనంగా ఆవిర్భవించిన చేర్యాల మున్సిపాలిటీ మొదటి చైర్‌పర్సన్‌గా ప్రజలకు సేవచేసే అవకాశం రావడం అదృష్టంగా భావించాను. ప్రజలిచ్చిన అవకాశంతో పట్టణ అభివృద్ధికి కృషి చేశానని చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి 'సాక్షి'తో అన్నారు. పట్టణ కేంద్రంలో 50 పడకల ఆస్పత్రి పనులు కొనసాగుతున్నాయి. అలాగే, రూ.1.50 కోట్లతో డంప్‌యార్డు, శ్మశానవాటికను నిర్మించామని తెలిపారు. అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, మౌలిక వసతులు కల్పించామని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి హరీశ్‌రావు, అప్పటి ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.10 కోట్ల నిధులను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేయడంతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడిందని చెప్పారు. తాను ఎన్నికైన మొదటి రెండేండ్లు కరోనాతో ఇబ్బంది పడినప్పటికీ మిగిలిన మూడు సంవత్సరాల కాలంలో మున్సిపాలిటీ అభివృద్ధికి కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది అందించిన సహకారం మరవలేనని అన్నారు.

## చట్టాలపై అవగాహన అవసరం

హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్



సదస్సులో మాట్లాడుతున్న కృష్ణతేజ్

అక్కన్నపేట(హుస్నాబాద్): చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని హుస్నాబాద్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ అన్నారు. అక్కన్నపేట మండలం మల్లంపల్లిలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల విద్యాధికారి గుగులోతు రంగ నాయక్ అధ్యక్షతన న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే నేరాలు చేయడానికి భయపడతారన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటే మంచి స్థాయికి చేరుకుంటారని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగంలో ఉన్న ప్రాథమిక హక్కుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం పలువురిని శాలువలతో సన్మానించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సర్వన్ నాయక్, న్యాయవాదులు రామకృష్ణ, మురళి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, లింగయ్య, పంతులు పాల్గొన్నారు.

## బీజేపీ తెలంగాణకూ ప్రమాదమే

- సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ప్రారంభమైన సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలు

ఎరుపెక్కిన సంగారెడ్డి





సంగారెడ్డి పట్టణంలో సీపీఎం నాయకుల ర్యాలీ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: బీజేపీ దేశానికే కాదు తెలంగాణ కూడా ప్రమాదకరంగా మారుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సంగారెడ్డిలో శనివారం నుంచి మూడురోజుల పాటు జరగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలకు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, బృందాకరత్‌తోపాటు సీపీఎం రాష్ట్ర ముఖ్యనేతలు హాజరయ్యారు. ఈసందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బహిరంగసభలో తమ్మినేని మాట్లాడుతూ.. తెలంగాణలో బీజేపీ వేగంగా ఎదుగుతోందని, ఎన్నడూలేని విధంగా పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల శాతంతో పాటు సీట్ల శాతం కూడా పెరిగిందన్నారు. కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య బీజేపీ విద్వేషాలు రెచ్చగొట్టి ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తోందని తెలిపారు. మతోన్మాద బీజేపీ కుట్రలను ఎదుర్కొనేందుకు, సమస్యలపై పోరాటాలు చేసేందుకు సీపీఎం ఎప్పు డూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. బీజేపీపై పోరుకు కాంగ్రెస్, బీఆర్ఎస్‌తోపాటు సామాజిక శక్తులు కలసి రావాలని పిలుపునిచ్చారు.

**బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్: వీరయ్య**

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య మాట్లాడుతూ...రాష్ట్రంలో తొమ్మిదేళ్ల అహంకార ప్రభుత్వాన్ని కూలగొట్టామనే సంతోషం ఎక్కువ కాలం నిలవలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ పాలన మాదిరిగానే వ్యవహరిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా ఇళ్లు నిర్మిస్తామని చెప్పిన కేంద్రం ప్రభుత్వం ఇప్పటివరకు తెలంగాణలో ఎన్ని ఇళ్లు నిర్మించిందో లెక్కచెప్పాలన్నారు.

## క్లుప్తంగా

### పుదుచ్చేరిలో పాపన్నపేట విద్యార్థి వైజ్ఞానిక ప్రదర్శన


ప్రశంసాపత్రంతో విద్యార్థి శివ

పాపన్నపేట(మెదక్): దక్షిణ భారత దేశ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాపన్నపేట మండలం చీకోడ్ లింగాయపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి పాల్గొని ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు గైడ్ టీచర్ కిషన్ ప్రసాద్ తెలిపారు. 21 నుంచి 25 వరకు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో శివ చైతన్య రూపొందించిన అత్యాధునిక మల్టీ పర్పస్ హైడ్రాలిక్ వాహనం గురించి వివరించినట్లు తెలిపారు. ప్రశంసాపత్రంతోపాటు అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు.

### భూమిని తిరిగి ఇచ్చిన మహిళ

చిన్నశంకరంపేట(మెదక్): మరో మహిళకు చెందిన భూమి పొరపాటున ధరణిలో తన పేరున పడడంతో మళ్లీ వారి పేరిట పట్టా చేసిన మహిళను పలువురు అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సూరారం గ్రామానికి చెందిన పోచగల్ల బాలమ్మకు చెందిన 8.5 గుంటల భూమి అదే గ్రామానికి చెందిన కంది యశోద పేరున ధరణిలో రికార్డు అయింది. ఇన్నాళ్లు ప్రయత్నించినా తిరిగి పట్టా చేయడం కుదరలేదు. శనివారం తహసీల్దార్ మన్నన్ ఇద్దరు మహిళలను పిలిపించి భూమాత పోర్టల్‌లో స్లాట్‌బుక్ చేయించి పట్టామర్పిడి చేశారు. తనదికాని భూమిని తిరిగి పట్టా చేసేందుకు ముందుకొచ్చిన యశోదను తహసీల్దార్ మన్నన్ సన్మానించారు.

### లారీని ఢీకొట్టిన ఆటో

**వ్యక్తికి తీవ్ర గాయాలు**

చిన్నశంకరంపేట(మెదక్): లారీని ఆటో ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన పేట మండలం మిర్జాపల్లి శివారులో చోటు చేసుకుంది. శనివారం మిర్జాపల్లి–చిన్నశంకరంపేట రహదారిపై ఓ లారీని డ్రైవర్ పక్కకు నిలిపాడు. ఇదే మండలంలోని జంగరాయి ఎర్రగుంట తండాకు చెందిన కాట్రోత్ లచ్చిరామ్ నార్సింగి నుంచి స్వగ్రామానికి ఆటోలో వెళ్తున్నాడు. మార్గమధ్యలో ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

**మహిళ కాలుపై నుంచి వెళ్లిన బస్సు**

జిన్నారం (పటాన్‌చెరు): మహిళ కాలుపై నుంచి ఆర్టీసీ బస్సు వెళ్లిన ఘటన గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్వర్ రెడ్డి కథనం మేరకు.. కొడిపల్లి మండలం పాంపల్లి గ్రామానికి చెందిన మహంకాళీ భారతి (55) కొడిపల్లి నుంచి దోమడుగుకు వచ్చేందుకు శనివారం ఉదయం మెదక్ డిపో బస్సులో బయలుదేరి బొంతపల్లి కమాన్ వద్ద దిగింది. దిగాక అక్కడే నిలిచి ఉండటాన్ని గమనించని డ్రైవర్ ముందుకు వెళ్తున్న క్రమంలో వెనుక టైర్ ఆమె కాలుపై నుంచి వెళ్లింది. ఈ ప్రమాదంలో కాలు నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం మహిళను సూరారం మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మహిళ కుమారుడి ఫిర్యాదు మేరకు డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



# గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు

## దేశభక్తి.. చరిత్రకు స్ఫూర్తి

- చారిత్రాత్మక బురుజులపై ఎగురనున్న జాతీయ జెండా
- మాజీ సైనికులు, పోరాట యోధులకు గుర్తుకు స్మారక స్తూపాలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేకతను చాటుతున్న కొన్ని ప్రాంతాలు

సండే స్పెషల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణతంత్ర వేడుకలకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని చారిత్రాత్మకమైన నేపథ్యం ఉన్న బురుజులపై జెండా రెపరెపలాడనుంది. గ్రామస్తులు, పార్టీలకు అతీతంగా నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై బురుజుల వద్ద జెండా ఎగురవేయనున్నారు. కొన్ని చోట్ల ఏడాది పొడవునా జెండా గగనతలంలో రెపరెపలాడనుంది. మరికొన్ని చోట్ల అమర జవాన్‌లు, పోరాట యోధులుగా గుర్తుగా స్తూపాలను ఏర్పాటు చేసి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్నారు. ఇలాంటి ప్రత్యేకతను కలిగి ఉన్న వాటిపై గణతంత్ర దినోత్సవం సందర్భంగా కథనం..

### వందేళ్ల కిందటి బురుజు


లాల్ కమాన్


చారిత్రక బురుజు

సిద్దిపేటజోన్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో బురుజు అనే పదం ప్రసిద్ధి చెందింది.. చారిత్రాత్మకమైన నేపథ్యంలో ఉన్న బురుజు కొన్ని వందల ఏళ్ల కిందట నిర్మించినట్టు చరిత్ర చెబుతోంది. సిద్దిపురం అనే పట్టణానికి మధ్యలో లాల్‌కమాన్ ప్రధాన ద్వారంగా నలు దిక్కుల నాలుగు బురుజులు శత్రువుల నుంచి రక్షణ కోటకు అనుసంధానంగా ప్రహరీ ఉండేది. కాలక్రమేణా మూడు బురుజులు కనుమరుగు అయ్యాయి. ప్రస్తుతం చరిత్రకు ఆనవాళ్లుగా లాల్‌కమాన్, ఒకే ఒక బురుజు మిగిలింది. నిజాం పాలన అనంతరం స్వాతంత్ర్యం వచ్చిన నేపథ్యంలో బురుజు మీద, లాల్ కమాన్ పైన స్వాతంత్ర్య వేడుకలకు సూచికగా ప్రతీసారి జాతీయ జెండా ఎగురవేయడం ఆనవాయితీగా వస్తుంది.నాలుగు ఏళ్ల బురుజులో దేశభక్తి భావం ఉట్టిపడేలా అందంగా త్రివర్ణ శోభితంగా రంగులు దిద్దారు.

### ఇక్కడ మూడు సార్లు జెండా ఎగురవేత


బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజు

మద్దూరు(హుస్నాబాద్): దేశంలో ఎక్కడైనా స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సం రెండు సార్లు మాత్రమే జాతీయ జెండాను ఎగురవేస్తుంటారు. కానీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరత్వం చూపిస బైరాన్‌పల్లి గ్రామంలో మాత్రం బురుజుపై స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలతోపాటు సెప్టెంబర్ 17న కూడా జాతీయ జెండాను ఎగురవేస్తారు. 1948 సెప్టెంబర్ 17 నుంచి ఈ విధంగా జాతీయ జెండాను ఎగురవేస్తున్నారు. దేశంలో 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం రాగా తెలంగాణకు మాత్రం 1948 17న స్వాతంత్రం వచ్చింది. దేశానికి బ్రిటిష్ పాలన నుంచి విముక్తి లభిస్తే తెలంగాణకు మాత్రం నిజాం నుంచి విముక్తి లభించింది. అప్పటి నుంచి గ్రామస్తులు బురుజు పై జెండాను ఎగురవేస్తారు.

### సోలార్‌తో విద్యుత్


టేక్మాల్‌లో సోలార్ ప్లాంట్

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలంలోని మూడు సోలార్ ప్లాంట్ల ద్వారా సూర్యరశ్మితో విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేసినా వీణీ ఎనర్జి సోలార్ కంపెనీ ద్వారా 50 మెగా వార్ట్స్ కెపాసిటీ విద్యుత్‌ను, రెన్యూ పవర్ కంపెనీ ద్వారా 64 మెగావాట్స్ కెపాసిటీ విద్యుత్‌ను, దినాకర్ టెక్నాలజీ (అదానీ) ద్వారా 24 మెగావాట్స్ కెపాసిటీ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయినా విద్యుత్‌ను పాపన్నపేట మండలం మిన్‌పూర్ 220 కేవీ సబ్‌స్టేషన్‌కు పంపుతున్నారు.

### నిరంతరం గగనతలం

- తున్కిఖాల్సాలో 48 అడుగుల ఎత్తుతో త్రివర్ణ పతాకం



వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం తున్కిఖాల్సా గ్రామ పల్లె ప్రకృతి వనంలో ఏడాది పొడుగునా నింగిని తాకేలా 48 అడుగుల ఎత్తున జాతీయ జెండా రెపరెపలాడుతోంది. దేశ భక్తికి చిహ్నంగా, ఊరికి ఒక గుర్తింపుగా ఉండేలా మాజీ సర్పంచ్ కటికె సంధ్యజానీ దంపతులు నాలుగేళ్ల కిందట 2021 జనవరిలో భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయించారు. జెండా స్తంభం ఎత్తు 48 అడుగులు ఉంటుంది. దానికి చివరన బిగించే త్రివర్ణపతాకం 12 అడుగుల ఎత్తు, 18 అడుగుల వెడల్పు కలిగి ఉంటుంది. గాలి తాకిడి తట్టుకునేలా పటిష్టమైన గద్దెను నిర్మించారు. ఆహ్లాదాన్ని పంచే పల్లె ప్రకృతి వనంలో కొలువుదీరిన ఈ పతాకాన్ని తొలిసారి 2021జనవరి 26 రిపబ్లికే డే రోజున ఆవిష్కరించారు. నాటి నుంచి ఏడాది పొడుగునా గగనాన రెపరెపలాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ప్రతీయేటా స్వాతంత్ర దినోత్సవం, రిపబ్లిక్ డే, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ఈ భారీ పతాకావిష్కరణ ఆనవాయితీగా కొనసాగుతుంది. ఏవైనా కలరింగ్, పైపులకు మరమ్మతులైతే తప్ప నిరంతరం పతాకం రెపరెపలాడుతుంది.


తున్కిఖాల్సాలో భారీ త్రివర్ణపతాకం

### బురుజుపై జెండా ఆవిష్కరణ


లక్ష్మాపూర్ గ్రామంలోని బురుజుపై జెండా

రామాయంపేట (మెదక్): రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలోని బురుజుపై జాతీయ జెండాను ఆవిష్కరించడం ఆనవాయితీగా వస్తుంది. గ్రామానికి చెందిన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆరేళ్ల కిందట పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పతాకావిష్కరణ రోజు ప్రత్యేకంగా గ్రామస్తులు, పార్టీలకు అతీతంగా నాయకులు పెద్ద సంఖ్యలో బురుజు వద్దకు చేరుకొని జెండా ఎగురవేస్తారు.

### మొదట గాంధీచౌక్ వద్ద


గాంధీచౌక్‌లోని జెండా గద్దె

నారాయణఖేడ్: స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా నాడు రజాకార్ల నిర్బంధాన్ని ఎదుర్కొని జెండా ఎగురవేసి జైలు జీవితాన్ని గడిపి నాటి పోరాట పటిమను చాటి చెబుతూ నేటి తరానికి తెలిసేలా ప్రతీ స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం రోజున మొట్ట మొదటి జెండా నారాయణఖేడ్‌లోని గాంధీ చౌక్‌లో ఎగురుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం నిజాం నిరంకుశ పాలన సాగుతున్న తరుణంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా గాంధీ చౌక్‌లో మొట్టమొదటి జెండాను స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ ఎమ్మెల్యే అప్పారావుషెట్కార్, శివరావుషెట్కార్‌లు ఎగురవేశారు. జెండా ఎగుర వేసినందుకు నాటి నిజాం పాలకులు 18 నెలలపాటు అప్పారావుషెట్కార్, శివరావుషెట్కార్‌తో పాటు కోస్గికర్ నరసింహారావు మాస్టర్‌లను ఔరంగాబాద్ జైలులో బంధించారు. నాటి నుంచి నేటి వరకు ప్రతీ జెండావిష్కరణ సందర్భంగా ఇక్కడ శివరావుషెట్కార్ కుమారుడు ఎంపీ సురేశ్ షెట్కార్ మొట్టమొదటి జెండాను ఎగురవేస్తారు.

### చేతినిండా అభిమానం

**పప్పు దినుసులతో జాతీయ జెండా**



గజ్వేల్‌రూరల్: పప్పు దినుసులతో 3 అంగులాల జాతీయ జెండాను రూపొందించాడు పట్టణానికి చెందిన కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎర్ర పప్పు, బియ్యం, పెసర్లను ఉపయోగించి అరచేతిలో జాతీయ జెండాను రూపొందించడం జరిగిందని పేర్కొన్నాడు.

### జవాన్ల జన్మభూమి 'ధనసిరి'


సైనికుడిగా దేవరాజ్

జహీరాబాద్ టౌన్: సైన్యంలో చేరడమంటే ప్రాణాలతో చెలగాటమని తెలిసినా.. దేశ రక్షణ కోసం మేము సైతం అంటూ ఆ ఊరిలో ఎన్నో కుటుంబాలు ఆర్మీలో చేరాయి. దేశాన్ని రక్షించే బాధ్యత అందరిదీ, ఇంటి నుంచి ఒకరైనా సైన్యంలో చేరాలన్నదే గ్రామం ప్రజల ఆశయం. తెలంగాణ- కర్నాటక రాష్ట్ర సరిహద్దులో సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలంలో ఉన్న ధనసిరి గ్రామంలోని ఎంతో మంది సైన్యంలో చేరి దేశ సేవ చేస్తున్నారు. ఒకరు కాదు.. ఇద్దరు కాదు సుమారు వంద మంది వరకు ఆర్మీలో వివిధ హోదాలో పనిచేశారు. కొంత మంది ఉద్యోగ విరమణ చేసి పోలీసు శాఖలో సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం పది మంది వరకు సైన్యంలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామం నుంచి ఏటా కొంత మంది ఆర్మీలో చేరుతుంటారు. ఇటీవలె ఓ యువకుడు నేవీలో చేరాడు. విశ్రాంత జవానులు సైన్యంలో చేరేందుకు యువతను ప్రోత్సహిస్తుంటారు.

### అమర జవానుల స్మారక స్థూపం


బీదర్ చౌరస్తాలో స్మారక స్తూపం

జహీరాబాద్ టౌన్: అమర జవానుల జ్ఞాపకార్థం విశ్రాంత జవాన్లు, యువకులు జహీరాబాద్ పట్టణం సమీపంలో బీదర్ చౌరస్తాలో స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేశారు. ఐదేళ్ల కిందట స్మారక స్తూపాన్ని ఏర్పాటు చేసి అమర జవానులకు సంబంధించిన ప్రతీ సందర్భంలో నివాళులర్పిస్తున్నారు. దీంతో బీదర్ చౌరస్తా అమర జవాన్‌ల చౌక్‌గా మారింది. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవంతోపాటు కార్గిల్ విజయ్ దివస్ తదితర సందర్భాల్లో మాజీ సైనికులు, యువకులు అమరులైన జవానులకు నివాళులర్పిస్తున్నారు. మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం యాజమాన్యం స్థూపం చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి పూల మొక్కలను నాటించారు. పచ్చదనంతో స్థూపం వచ్చిపొయే వారిని ఆకర్షిస్తుంది.

## ప్రాణం తీసిన చేపల వేట

**విద్యుదాఘాతంతో మత్స్యకారుడు మృతి**


జంపులు మృతదేహం


నంగునూరు(సిద్దిపేట): చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుదాఘాతంతో మత్స్యకారుడు మృతి చెందిన ఘటన నంగునూరులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కన్నారం జంపులు (45) చేపల వేటతోపాటు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శనివారం గ్రామం గుండా పారే మోయతుమ్మెద వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. విద్యుత్ తీగతో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు.

**చెరువులో పడి వ్యక్తి**


శంకర్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పేట ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు.. గవ్వలపల్లి మధిర గ్రామమైన ఆగ్రహారానికి చెందిన కంతి శంకర్(39) హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రెండు రోజుల కిందట గ్రామానికి వచ్చి గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. భార్య వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**చికిత్స పొందుతూ వ్యక్తి..**


కరుణాకర్ (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట)/చేర్యాల (సిద్దిపేట): ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తి ఇంటి ఎదుట శనివారం బంధువులు మృతదేహంతో ధర్నా నిర్వహించడంతో తాండూర్‌లో ఉద్రికత్తత చోటు చేసుకుంది. రాజగోపాల్‌పేట ఎస్ఐ అసీఫ్ కథనం మేరకు.. నంగునూరు మండలం ఖానాపూర్‌కు చెందిన గణపురం కరుణాకర్ (20) గురువారం అదే గ్రామానికి చెందిన మల్లారెడ్డి పొలానికి కూలీ పనులకు వెళ్లాడు. అనంతరం స్నేహితులు చిందల శశికుమార్, అనిల్‌తో కలిసి మోటార్ సైకిల్‌పై ఇంటికొస్తున్నాడు. మార్గమధ్యలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను వీరి బైక్ ఢీకొట్టడంతో కరుణాకర్, శశికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సిద్దిపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కరుణాకర్ పరిస్థితి విషమంగా ఉండటంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు.

**చికిత్స పొందుతూ వృద్ధురాలు**

పటాన్‌చెరు టౌన్: ఆటో బోల్తా పడిన ఘటనలో తీవ్ర గాయాలైన వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామం అంబేడ్కర్ కాలనీకి చెందిన కాసాల మల్లమ్మ 23న లక్దారంలో ఉండే కూతురు మంజుల వద్దకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో బోల్తా పడింది. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం ముందుగా సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించగా శనివారం తెల్లవారుజామున మృతి చెందింది. మృతురాలి కుమారుడు సాయిలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కూలీ..**

కొండపాక(గజ్వేల్): ఆత్మహత్యానికి పాల్పడిన కూలీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రంలోని జవందిపూర్‌కు చెందిన భార్యాభర్తలు సుగ్యాని నాయక్, బసంత్ నాయక్ (30) 4 నెలల కిందట బతుకు దెరువు కోసం కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి గ్రామ శివారులో గల ఓ పౌల్ట్రీఫాంలో పనిలో చేరారు. కూలీ పనులు చేయగా వచ్చిన డబ్బులతో రోజూ మద్యం తాగుతుండటంతో తాగొద్దంటూ భార్య మందలించేది. శుక్రవారం సాయంత్రం కూరగాయల సంతకు వెళ్లి అతిగా మద్యం తాగి రావడంతో భార్య గొడవపడింది. దీంతో మనస్తాపానికి గురై పౌల్ట్రీఫామ్ పరిసరాల్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. ఇతర కూలీల సహాయంతో గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## చదువుల్లో మేటి.. చలో ఢిల్లీ

- పేదింటి బాలిక హేమకు అరుదైన అవకాశం
- రిపబ్లిక్ డే వేడుకలను నేరుగా తిలకించనున్న విద్యార్థిని
- వర్గల్ గురుకులంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతూ ఎంట్రెన్స్‌లో ప్రతిభ


ఢిల్లీ రిపబ్లిక్ డే వేడుకలకు వెళ్తున్న బృందంతో హేమ (కుడి నుంచి నాలుగో బాలిక)

వర్గల్(గజ్వేల్): ఢిల్లీకి వెళ్లి రిపబ్లిక్ డే వేడుకలను నేరుగా తిలకించే అవకాశమొస్తే ఎగిరి గంతేస్తాం. అలాంటి వేడుకలను చూసేందుకు అతిథిగా ఆహ్వానిస్తే ఆ ఆనందం ఊహలకు అందదు. సరిగ్గా అలాంటి అరుదైన అవకాశం తెలంగాణ నుంచి పేదింటి బాలిక, సిద్దిపేట జిల్లా వర్గల్ జ్యోతిబా పూలే గురుకుల డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థిని తెనుగొండ హేమకు దక్కింది. చదువుల్లో టాపర్‌గా నిలిచినందుకు యశస్వి పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా హేమ ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

**పేద కుటుంబం**

చదువుల్లో రాణిస్తూ 'పల్లెటూరు నుంచి ఢిల్లీ' కి వెళ్లే అవకాశం దక్కించుకున్న తెనుగొండ హేమ జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం దమ్మయ్యపేట సొంత గ్రామం. ఆమె తల్లిదండ్రులు వెంకటి, స్వరూప. ఐదుగురు పిల్లల్లో పెద్ద కూతురు హేమ. తండ్రి వెంకటి డ్రైవర్. కొద్దిపాటి భూమి ఉన్నప్పటికీ సరిపడా ఆదాయం రాకపోవడంతో డ్రైవర్‌గా పని చేసేందుకు విదేశాలకు వెళ్లారు.

**చదువంతా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే..**

కుటుంబ పేదరికం వల్ల హేమ చదువంతా సర్కారీ బడుల్లోనే కొనసాగింది. గ్రామ పాఠశాలలో 5 వరకు, ఎంట్రెన్స్‌లో సిరిసిల్ల బీసీ హాస్టల్‌లో సీటు సాధించి అక్కడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పది వరకు చదివింది. పట్టుదలగా చదువుతూ టెన్త్‌లో 10 జీపీఏ సాధించింది. ఎంట్రెన్స్ పరీక్ష ద్వారా కరీంనగర్ ఎల్ఎండీ కాలనీలోని జ్యోతిబా పూలే గురుకుల జూనియర్ కళాశాలలో సీటు సాధించి సీఈసీలో చేరింది. 909 మార్కులతో ఉత్తీర్ణురాలైన హేమ అదే ఊపులో ఎంట్రెన్స్ పరీక్షలో ప్రతిభచాటి సిద్దిపేట జిల్లా వర్గల్ పూలే డిగ్రీ కళాశాలలో బీకామ్(సీఏ) సీటు సాధించుకుంది. చదువుకు పేదరికం అడ్డుకాదని చాటుతూ మార్కుల సాధనలో మేటిగా నిలిచింది. డిగ్రీ ఫైనలియర్ నాలుగో సెమిస్టర్‌లో గురుకుల టాపర్‌గా నిలిచి అబ్బురపరిచింది. ప్రాథమిక పాఠశాల నుంచి డిగ్రీ వరకు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదివింది. 'యశస్వీ' పథకం ద్వారా న్యూఢిల్లీలో రిపబ్లిక్ డే వేడుకలు తిలకించే అవకాశం దక్కించుకుంది. శుక్రవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర బృందంతో ఢిల్లీకి బయల్దేరింది. కాగా హేమ చదువుతో పాటు కరాటేలోనూ బ్రౌన్ బెల్ట్ సాధించింది.

### ఈ పథకం గొప్ప వరం



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకల్లో పాల్గొనే అవకాశం నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రధాన మంత్రి యశస్వీ పథకం ద్వారా తమను ఎంపిక చేసి ఢిల్లీకు పంపిస్తున్నారు. తనకు ఇలాంటి అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉంది. ఈ పథకం పేద విద్యార్థులకు టర్నింగ్ పాయింట్ అని చెప్పవచ్చు. ఇది ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. తాను గణతంత్ర వేడుకల్లో పాల్గొనడానికి కృషి చేసిన జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, మా వార్డెన్ వెంకటలక్ష్మీలకు కృతజ్ఞతలు.

– శ్వేత, 10వతరగతి,
బీసీ బాలికల వసతి గృహం,
రామచంద్రాపురం

### కలలో కూడా అనుకోలేదు



మాది పేద కుటుంబం నేను ఇంట్లో పెద్ద కూతురిని. తల్లిదండ్రులు కష్టజీవులు. ఇలాంటి పరిస్థితుల్లో ఎదురీదుతున్న కుటుంబం నుంచి ఢిల్లీకి వెళ్లి ప్రముఖులతో రిపబ్లిక్ డే వేడుకలు తిలకిస్తానని కలలో కూడా అనుకోలేదు. అలాంటి అరుదైన అవకాశం 'చదువు' ద్వారా దక్కడం అనిర్వచనీయ ఆనందం కలిగిస్తుంది. నా జీవితంలో ఇదో మరచిపోలేని గొప్ప జ్ఞాపకంగా నిలుస్తుంది.

– తెనుగొండ హేమ